హైదరాబాద్ వార్త

# అవగాహనతోనే తలసేమియాను ఎదుర్కోవచ్చు

**ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి**

**జూబ్లీహిల్స్, మే 10, ప్రభాతవార్త :** తలసేమియా వ్యాధిపై ప్రజల్లో విస్తృత అవగాహన పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాలను రక్షి ంచ వచ్చని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్‌లో నిర్వహిం చిన 3కే, 5కే, 10కే తలసేమియా రన్ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆమె ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో మీడియాతో మాట్లాడారు. తలసేమియా అనేది తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమించే జన్యుపరమైన రక్తహీనత వ్యాధి అన్నారు. శరీరంలో ఆక్సిజన్‌ను సరఫరా చేసే హిమోగ్లోబిన్ సరైన రీతిలో తయారు కాకపోవడంతో బాధితులు తీవ్రమైన రక్తహీనతకు గురవుతార న్నారు. తల్లిదండ్రులిద్దరూ క్యారియర్లు అయితే పిల్లలకు ఈ వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. వివాహానికి ముందు రక్త పరీక్షలు, గర్భధారణ సమయంలో స్క్రీనింగ్, కుటుంబాల్లో అవగాహన పెంపు వంటి చర్యల ద్వారా తలసేమియా కేసులను గణనీయంగా తగ్గించవచ్చని భువనేశ్వరి అన్నారు.

ప్రస్తుతం రెగ్యులర్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్, ఐరన్ నియంత్రణ మందులు, వైద్య పర్యవేక్షణతో పాటు కొన్ని సందర్భాల్లో బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ ద్వారా చికిత్స అందిస్తున్నారని తెలిపారు. ప్రజల్లో అవగాహనే తలసేమియాపై ప్రధాన ఆయుధమని ఆమె అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని, తలసేమియా బాధిత చిన్నారులకు మానసికంగా అండగా నిలవాలని పిలుపునిచ్చారు. నిరోధమే ఉత్తమ చికిత్స అనే భావనతో ముందస్తు పరీక్షలు, సరైన అవగాహన ద్వారా తలసేమియా లేని ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని ఆమె వివరించారు.

## క్యాసినో జూదంలో రూ. 50 లక్షలు నష్టం

### ఆర్థిక ఇబ్బందులతో పౌల్ట్రీ రైతు ఆత్మహత్య

**అల్వాల్, మే 10 ప్రభాతవార్త:** క్యాసినో జూదం పౌల్ట్రీ రైతు ప్రాణాలు మీదకు తెచ్చింది. జూదంలో 50లక్షలకు పైగా నష్ట పోవడంతో ఆర్థిక పరమైన ఇబ్బందులు ఆయనను ఆత్మహత్య వైపుకు నడిపించాయి. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అల్వాల్ జొన్నబండలోని సాన్వీ ప్రైడ్ విల్లా నెంబరు 98లో తెరాల సూర్య తేజ, తండ్రి తెరాల శ్రీనివాస్(54), తల్లితో కలిసి నివాసం ఉంటున్నారు. కుటుంబానికి సిద్దిపేట జిల్లా, గజ్వేల్ మండలం, కొడ కొండ గ్రామంలో కోళ్ళ ఫామ్ ఉంది. కోళ్ళ సీజన్ కావడంతో కుటుంబం మొత్తం ఫామ్ వద్దే నివాసం ఉంటున్నారు. నాలుగు నెలలుగా వీరంతా అక్కడే ఉంటూ వ్యాపారం చూసుకుంటున్నారు. ఈ నెల 9వ తేదీన రాత్రి సుమారు 11 గంటలకు శ్రీనివాస్ హుందాయ్ వెన్యూ(టిఎస్ 36జె 2000) కారులో ఇంటికి వెళుతున్నాని చెప్పి అల్వాల్‌కు వచ్చాడు. 10వ తేదీ ఉదయం 6.30 గంటలకు శ్రీనివాస్ కొడుకు సూర్య తేజకు ఫోన్ చేసి తనకు భారీగా అప్పులు ఉన్నాయని తీర్చడానికి ఇబ్బందులు పడు తున్నానని చెప్పాడు. మూడు రోజులు క్రితం అప్పులు విషయంలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ చని పోవాలని ఉందని పేర్కొన్నాడు. తండ్రి మాటలు తేడాగా ఉండడంతో ముందు రోజు రాత్రి అకస్మాతుగా ఇంటికి వెళ్ళ పోవడంపై అనుమానం వచ్చింది. కోళ్లఫామ్‌లో ఉన్న సూర్య తేజ తన తల్లితో కలిసి ఆదివారం అల్వాల్‌కు చేరుకున్నారు. ఇంటి వద్దకు వచ్చి తండ్రికి ఫోన్ చేసినా స్పందించక పోవడంతో ఆదనపు తాళంతో తలుపులు తీసి బెడ్‌రూములో పరిశీలించగా ఆయన ఫ్యానుకు ఉరి చేసుకుని ఉన్నాడు. క్యాసినో జూదంలో లక్షలు పొగొట్టున్న నేపథ్యంలోనే తన తండ్రి మానసికంగా కృంగి ఉన్నారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు లో బాధితుడు కుమారుడు పేర్కొన్నాడు. జూదంలో నష్ట పోయిన సొమ్మును తిరిగి అప్పులు వారికి చెల్లించేందుకు ఇంటిపై రుణం తీసు కుందామని పలుమార్లు తన తండ్రి పేర్కొన్నట్లు తెలిపాడు. క్యాసినో జూదంలో నష్టపోయిన నేపథ్యంలో ఆత్మహత్యకు బాధితుడు పాల్పడి నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.

## వెహికిల్ రికవరీ ఏజెంట్ హత్య



ఆదిత్ పాండే (ఫైల్‌ఫోటో)

**సరూర్‌నగర్, మే 10 ప్రభాతవార్త:** శివారు హైదరాబాద్‌లో ఒక యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఆదివారం ఉదయం వెంకటాపూర్ బురాన్ ఖాన్ చెరువు సమీపంలో ఉస్మాన్‌నగర్‌వద్ద అసంపూర్తి నిర్మాణం జరిగిన పాత కట్టడం వద్ద ఒక యువకుని మృతదేహం కనిపించడంతో గమనించిన స్థానికులు బాలాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో సంఘటనా ప్రాంతానికి చేరుకొన్న పోలీసులు విచారణ జరిపి హతుడు కుర్మల్‌గూడ ఇందిరానగర్‌లో నివసిస్తున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నో సుల్తాన్‌పూర్ ప్రాంతానికి చెందిన ఆదిత్ పాండే(24)గా నిర్ధారించారు. ప్రైవేటుగా వాహనాల జప్తుచేసే ఉద్యోగి (వెహికిల్ రికవరీ ఏజెంట్) అయిన పాండేను మున్నా అనే వ్యక్తి తీసుకెళ్ళినట్లు పోలీసుల దర్యాప్తులో తెలిసింది. రికవరీల విషయంలో జరిగిన గొడవలో కక్షపెట్టుకొని హత్యచేసి ఉండవచ్చని భావిస్తున్నారు. హత్యకుగురైన పాండే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. సంఘటనా స్థలాన్ని శంషాబాద్ డిసిపి రాజేశ్ ఆదిభట్ల ఎసిపి ప్రదీప్ కుమార్‌రెడ్డి, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌తో కలిసి పరిశీలించారు. కాగా హత్యకుగురైన పాండేకు భార్య, సంవత్సరం వయసున్న కూతురు ఉంది. హత్యకుగల కారణాలపై అన్ని కోణాల నుండి దర్యాప్తు జరుగు తున్నదని డిసిపి తెలిపారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంలు సంఘటనా ప్రాంతంలో విచారణ జరిపాయి. కేసును బాలాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## హైదరాబాద్‌లో కొనసాగుతున్న డ్రంకన్ డ్రైవ్ దాడులు

### 351 మంది మందుబాబుల పట్టివేత

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** జంట నగరాలలో మందు బాబుల భరతం పట్టేందుకు డ్రంకన్ డ్రైవ్ దాడులు కొనసాగుతూనే వున్నాయి. శుక్రవారం, శనివారం రాత్రుల్లో ట్రాఫిక్ పోలీసులు పలుచోట్ల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ దాడుల్లో మొత్తం 351 మంది మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 292 మంది ద్విచక్ర వాహనదారులు, 30 మంది ఆటోడ్రైవర్లు, 29 మంది కార్లతో పాటు భారీ వాహనాల డ్రైవర్లు ఉన్నారు. పట్టుబడినవారిలో 69 మంది 30 నుంచి 50 పాయింట్ల వరకు వుండగా 146 మంది 51 నుంచి 100 పాయింట్ల వరకు, 65 మంది 101 నుంచి 150 పాయింట్ల వరకు, 44 మంది 151 నుంచి 200 పాయింట్ల వరకు, 15 మంది 201 నుంచి 250 పాయింట్ల వరకు, ఏడుగు రు 251 నుంచి 300 పాయింట్ల వరకు, ఐదుగురు 300 పాయింట్లకు మించి విపరీతంగా మద్యం సేవించినట్లు తేలింది. వీరిని అరెస్టు చేసిన తరువాత వారి వా హనాలు జప్తు చేసి, కేసులు నమోదు చేశాక సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించిన తరువా త కోర్టుల్లో హాజరు పరు స్తారు. కోర్టులు వీరికి శిక్షలు విధి స్తాయని నగర జాయింట్ ట్రాఫిక్ పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్ మీడియాకు తె లిపారు. జంట నగరాలలో డ్రంకన్ డ్రైవ్ దాడులు నిరంతరం కొనసాగుతాయని, వీటిని పూర్తిస్థాయిలో అరికడతామని ఆయన వెల్లడించారు.

**సైబరాబాద్‌లో 137 మంది...**

ఇదిలావుండగా సైబరాబాద్ పరిధిలో 137 మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 113 మంది ద్విచక్ర వాహనదారులు. ఐదుగురు ఆటో డ్రైవర్లు, 18 మంది కార్ల డ్రైవర్లు, ఒకరు భారీ వాహనాల డ్రైవర్ వున్నారు.

### 12 గంటల పాటు నిరంతరాయంగా

## హనుమాన్ చాలీసా పారాయణం

**సైదాబాద్, మే 10 ప్రభాతవార్త:** సైదాబాద్ కాలనీలోని శ్రీ సుదర్శన లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో దేవాలయ కమిటి ఆధ్వర్యంలో ఆదివారం హనుమాన్ చాలీసా పారాయణం అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆరు గంటలకు ప్రారంభమైన హనుమాన్ చాలీసా పారాయణం సాయంత్రం ఆరు గంటల వరకు మొత్తం 12 గంటల పాటు నిరంతరాయంగా కొనసాగింది. స్థానికులు పెద్దఎత్తున తరలివచ్చి హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్నారు. భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయం ప్రధాన అర్చకులు శ్రీ సుదర్శనం శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



పారాయణం చేస్తున్న భక్తులు



# మోడీ..మోడీ..మోడీ

* దద్దరిల్లిన పరేడ్‌గ్రౌండ్ పరిసర ప్రాంతాలు
* భారీగా తరలివచ్చిన బిజెపి శ్రేణులు
* మోడీ సభతో నగర బిజెపిలో జోష్






**హైదరాబాద్, మే 10,ప్రభాతవార్త:** కాషాయ శ్రేణుల జయజయ మోడీ ధ్వానులతో సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్ హోరెత్తింది. మోడీ! మోడీ! నినాదాలు ఒకవైపు.. కాషాయ జెండాల రెపరెపలు ఇంకోవైపు ఆ పరిసరాలను ప్రతిధ్వనింపజేశాయి. ఆదివారం పరేడ్‌గ్రౌండ్‌లో జరిగిన సభ విజయవంతం అయింది.ప్రధాని మోడీ పాల్గొనడం వల్ల బిజెపి శ్రేణుల్లో ఉత్సాహానికి హద్దులేకుండా పోయింది. అంతకుముందు తన కోసం కార్యకర్తలు తెచ్చిన పెయింటింగ్స్‌ను సేకరించాలని ప్రధాని ఎస్పీజీని ఆదేశించారు. పెయింటింగ్స్ వేసిన చిత్ర కళాకారులకు తిరిగి లేఖలు రాస్తానని చెప్పారు. "ప్రియమైన తెలంగాణ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు" అంటూ తెలుగులో మాట్లాడి ఆకట్టుకున్నారు. మోదీని చూసిన ఆనందంలో బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలతో సభ ప్రాంగణాన్ని హోరెత్తించారు. ఈ సందర్భంగా దేశం మొత్తం మార్పును కోరుకుంటోందన్న ప్రధాని, ఏ రాష్ట్రంలోనూ కుటుంబ పాలనను ప్రజలు కోరుకోవట్లేదని తెలంగాణలోనూ బీజేపీ సర్కార్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ కుటుంబ పార్టీలేనని తెలంగాణ అభివృద్ధికి ఎన్డీఏ సర్కార్ కట్టుబడి ఉంద న్నారు. మోడీ ప్రసంగంలో చేసిన చురకలకు బిజెపి శ్రేణుల నుంచి అపూర్వ స్పందన లభించింది. కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎంపై మోడీ విరుచుకుపడ్డాడు. బిజెపిని ఆశీర్వదించాలని తెలంగాణ ప్రజలను విజ్ఞప్తి చేశారు. కాగా గ్రేటర్‌తో హైదరాబాద్ నలుమూలలనుంచి బిజెపి కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివచ్చారు. దూరప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు, కొందరు బైక్‌లపై భారీ ర్యాలీగా సభా ప్రాంగణానికి వచ్చారు. నియోజకవర్గాలు, మండలాలు, మున్సిపల్ డివిజన్ల, గ్రామాల నుండి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులలో కార్యకర్తలు సభాస్థలికి తరలివచ్చారు.

**మోడీనగర పర్యటన సాగిందిలా...**

ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన మొదటగా హెచ్ఐసీసీలో జరిగిన కార్యక్రమంలో సిఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బండిసంజయ్‌లతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసారు. అనంతరం కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న జనసేనాని పవన్‌కళ్యాణ్‌ను పరామర్శించి ఆయన ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు. అనంతరం అక్కడి నుంచి నేరుగా ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు నివాసానికి చేరుకున్నారు.

చంద్రబాబు కుటుంబ సభ్యులతో కొద్దిసేపు గడిపిన ప్రధాని..అనంతరం ప్రధాని బేగంపేట విమానాశ్రయానికి వెళ్లి అక్కడ వేచి ఉన్న బీజేపీ శ్రేణులను, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించాల్సి ఉండగా సమయాభావం వల్ల ఆ కార్యక్రమాన్ని రద్దు చేసుకుని నేరుగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌కు చేరుకుని సభలో పాల్గొన్నారు.ప్రధాని రాక దృష్ట్యా పోలీసులు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేయడమే కాకుండా, నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

# లిక్కర్ "కల్తీ"గాళ్లు..!

**నగరంలో రెచ్చిపోతున్న మాఫియా**

**ఖరీదైన మద్యం సిసాలో నాసిరకం మిక్సింగ్**

**దావత్‌లు, ఫంక్షన్లకు ఆర్డర్లపై సరఫరా**

**ఎక్సైజ్‌శాఖ దాడుల్లో వెలుగులోకి నిజాలు**

**హైదారబాద్, మే 10,ప్రభాతవార్త:** నగరంలోని కల్తీగాళ్ల రెచ్చిపోతున్నారు. కంపెనీ, ఎక్సైజ్ శాఖ సీల్‌ను ఏ మాత్రం కదలించకుండా అందులోని మద్యాన్ని చాకచక్యంగా కొంత తీసి.. ఆ భాగాన్ని ఛీప్ లిక్కర్‌లతో నీళ్లను కలిపి విక్రయిస్తున్నారు. ఖరీదైన మద్యం తాగుతున్నామని ఫీలయ్యే వారు ఇలాంటి కల్తీ మద్యం బారిన పడి ఆరోగ్యాన్ని డబ్బును కోల్పోతున్నారు. ఇటీవల నగర శివారు ప్రాంతాల్లోనే ఇలాంటి కేసులు ఎక్కువగా వెలుగులోకి వస్తున్నాయి. వైన్‌షాపులు నిర్వహించే పర్మిట్ రూముల్లో, బార్లలో ఇలాంటివి ఎక్కువగా జరుగుతున్నాయి. తాజాగా ప్రీమియర్ లిక్కర్ మనకు మామూలు లిక్కర్ ధరలోనే మనకు లభిస్తుందన్న అంటూ నమ్మ బలికి ప్రీమియం లిక్కర్‌లో సాధారణ లిక్కర్ కలిపి ఫంక్షన్లలోనూ తెలిసినా..బడా బాబులకు అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్న ఒక ముఠాను ఎక్సైజ్ డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ సికింద్రాబాద్ పట్టుకున్నారు.. లిక్కర్ మిక్సింగ్ జరుగుతుందనే పక్కా సమాచారంతో సికింద్రాబాద్ ఎక్సైజ్ డిటిఎఫ్ సీఐ సావిత్రి సౌజన్య, టీం సిబ్బంది కలిసి రసూల్‌పుర మెట్రో స్టేషన్ సమీపంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల వద్ద 6 ఆరు శివాజీ రీగల్ ప్రీమియం లిక్కర్ బాటిల్ లభించాయి. వాటిని పరిశీలించగా ప్రీమియం లిక్కర్ బాటిల్‌లో తక్కువ ధర కలిగిన మద్యం మిక్సింగ్ చేసినటువంటిగా గుర్తించారు. ఈ విషయంపై నిందితులను ప్రశ్నించినప్పుడు.. అసలు విషయం వెల్లడించారు.మాదాపూర్‌లోని మిక్సింగ్ లిక్కర్ తయారీ ప్రాంతానికి నిందితులతో వెళ్లారు. లిక్కర్ మిక్సింగ్ ప్రాంతంలో 41 ఫుల్ బాటిల్స్ మిక్సింగ్ చేసినటువంటి శివాజీ రీగల్ మద్యం బాటిల్ ఉన్నాయి. మిక్సింగ్ మద్యం నింపడానికి వివిధ రకాలైన హై క్వాలిటీ ప్రీమియం లిక్కర్ బాటిల్స్ 63 లభించాయి. చివరకు రూ. 25 వేల విలువ కలిగిన రాయల్ సెల్యూట్ లాంటి మద్యం బాటిల్‌ని కూడా ఈ ముఠా మిక్సింగ్ మద్యంతో నింపి అమ్మకాలు సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నాట్టు ఎక్సైజ్ విచారణలో వెల్లడయింది. మిక్సింగ్ లిక్కర్ దందా ముఠాలో చికున్ స్వాయిన్, సోను మహంతి, ప్రఫుల్ కుమార్ నాయక్ ఉన్నట్లు సికింద్రాబాద్ డిటిఎఫ్ ఎక్సైజ్ సిబ్బంది గుర్తించారు. ఈకేసులో చికున్ స్వాన్, సోనుమహంతులను అరెస్ట్ చేశారు. ప్రఫుల్ కుమార్ నాయక్ పరారీలో ఉన్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ పంచాక్షరి, ఏఈఎస్ శ్రీనివాస రావు తెలిపారు.

**బార్లలో మొదటిరౌండ్‌లో వర్జినల్ ...తర్వాత కల్తీ**

శివార్లలోని చాలా బార్లలో కల్తీ చేసిన మద్యాన్ని చాలా చాకచక్యంగా మందుబాబులకు అంటగడుతున్నారు. మొదటిరౌండ్‌లో కోరుకున్న మద్యాన్ని సరఫరా చేస్తూ.. రెండో రౌండ్ కోరితే ఒరిజినల్ లిక్కర్‌లో కొంత మొత్తాన్ని కల్తీచేస్తారు. మూడో రౌండ్‌కోరుకున్న వారికి దాదాపు కల్తీ మద్యం లేదా వేరేబ్రాండ్‌లను సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే మరికొన్ని బార్లలో ఐబి, ఓసి ఫుల్‌బాటిళ్ల నుండి మద్యాన్ని తీసి ఖరీదైన బాటిళ్లలోకలుపుతూ కల్తీకి పాల్పడుతున్నారు. మరి కొన్ని బార్లలో ఏకంగా బాటిళ్లలో వేరే కంపెనీకి చెందిన మద్యం కాకుండా మినరల్ వాటర్ కలుపుతూ యథేచ్ఛగా కల్తీకి పాల్పడుతూ మద్యం ప్రియులు జేబులకు చిల్లు పెడుతున్నారు. వైన్స్‌ల్లో మూతలు కొట్టే ఆనవాయితీ ఇటీవల కాలంలో బార్లకు ఎగబాకింది. అయితే నగర శివార్లలో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించుకుంటున్నారు. రాత్రి సమయాల్లో ఇద్దరుచొప్పున మూతలు కొట్టేవిధుల్లో ఉంటున్నట్లు సమాచారం.

**ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యమే కారణమా..!**

కల్తీ మద్యం వ్యవహారాలను అరికట్టేందుకు తరుచుగా తనిఖీలు నిర్వహించాలి. వైన్‌షాపుల్లో మద్యం శాంపిళ్లు తీసి ల్యాబ్‌ల్లో పరీక్ష చేయించాలి. మరోవైపు నకిలీ మూతల తయారీదారులు, పంపిణీదారులపై కఠినచర్యలు తీసుకోవాలి. అక్రమాలకు పాల్పడే మద్యం వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.కానీ ఎక్సైజ్ శాఖలో ఈతరహా చర్యలు కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నాయకుల అండదండలు, మూమూళ్ల వ్యవహారాలే ఈ నిర ్లక్ష్యానికి కారణమేమోనన్న ఆరోపణలు వినిసిస్తున్నాయి.



### ఎల్‌బి స్టేడియంలో నేడు విద్యాశాఖ ఆధ్వర్యంలో

## విద్య ప్రత్యేక వారోత్సవాలు

**సాయంత్రం ఐదు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు**

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:**

విద్యా శాఖ ఆధ్వర్యంలో ఎల్‌బి స్టేడియంలో సోమవారం సాయంత్రం జరగనున్న విద్య ప్రత్యేక వారోత్సవాల కార్యక్రమం పురస్కరించుకుని స్టేడియం పరిసర ప్రాంతాలలో సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ మేరకు సిటీ ట్రాఫిక్ చీఫ్ జోయల్ డేవిస్ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో పాటు బషీర్‌బాగ్ చౌరస్తా పరిసర ప్రాంతాలు బాబు జగజీవన్ రాం చౌరస్తా నుంచి అబిడ్స్ వెళ్లే మార్గం, ఏఆర్ పెట్రోల్ బంక్ నుంచి పబ్లిక్‌గార్డెన్స్ వెళ్లే మార్గం, ఇక్కడి నుంచి నాంపల్లి వెళ్లే మార్గం, లిబర్టీ నుంచి బషీర్‌బాగ్ వచ్చే మార్గం వద్ద ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా వుండే అవకాశం వుంటుందని, ఈ మార్గాలలో ఆంక్షల సమయంలో వెళ్లే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలని ఆయన కోరారు. ట్రాఫిక్ సమాచారం కోసం 9010203626 నంబర్‌కు వాహనదారులు ఫోన్ చేయవచ్చని ఆయన తెలిపారు. ఆంక్షల సమయంలో వాహనదారులు ట్రాఫిక్ పోలీసుల సూ చనలను పాటించాలని జోయల్ డేవిస్ కోరారు.

### భారతీయ సంస్కృతిలో

## ప్రతి రోజూ మాతృమూర్తికి వందనమే

**ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ రమణచారి**

**చిక్కడపల్లి, మే 10 (ప్రభాతవార్త) :** అమెరికా వంటి విదేశాలలో మదర్స్ డే పేరిట ఒక రోజు చేసే పండుగలో ఆ ఒక్క రోజూ పిల్లలు తల్లినీ అతిథిగా హోటల్స్‌లో విందు ఇస్తారని కానీ భారతీయ సంస్కృతి లో ప్రతి రోజూ మాతృ మూర్తి కి వందనమే అని ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణ అన్నారు. ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదిక వంశీ ఆర్ట్స్ థియేటర్స్ అధినేత డాక్టర్ వంశీ రామరాజు నిర్వహణలో రాబోయే మాతృ దినోత్సవం సందర్భంగా వివిధ రంగాలకు చెందిన 34 మంది మాతృ మూర్తులకు సత్కార సభ జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రమణాచారి మాట్లాడుతూ కంటికి కనిపించే ప్రత్యక్ష దైవాలు తల్లి తండ్రి అని చెప్పారు వంశీ సంస్థ ఏది చేసినా భారీ గా ఉంటుందనీ, 34 మంది మాతృ మూర్తులను సత్కరించటం అపురూపం అని అభినందించారు. ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు మాట్లాడుతూ తన తల్లికి తనకి ఉన్న అనుబంధం గుర్తు చేసుకున్నారు. వంశీ రామరాజు అధ్యక్షత వహించి మాట్లాడుతూ వంశీ సంస్థ స్వర్ణోత్సవ పూర్తి చేసుకున్నదనీ తెలిపారు. తొలుత లక్ష్మీ శ్రీనివాస్ చే వీణా వాదనం డాక్టర్ తాడేపల్లి రామ లక్ష్మి చే అన్నమయ్య కీర్తనలు గానం చేశారు సుంకర పల్లి శైలజ పర్యవేక్షణ లో పురస్కారాలు ప్రదానం జరిగింది సుధామయి, సత్యవతి వ్యాఖ్యానం చేశారు.



గన్‌పార్కు వద్ద నిరసన తెలుపుతున్న నరేందర్‌గౌడ్ తదితరులు

## ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన

**సైఫాబాద్, మే 10 ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రపర్యటనకు వ్యతిరేకంగా ఆనేక మంది బిసిలు నగరంలో నల్ల జెండాలు, బెలూన్‌లు చేబూని పెద్దఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహం నుంచి గన్‌పార్కులోని తెలంగాణ అమరవీరుల స్థూపం వరకు కొనసాగింది. అనంతరం నరేందర్ గౌడ్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జనగణనలో బిసిల కులగణన చేస్తామని పార్లమెంట్‌లో హామీ ఇచ్చి ప్రస్తుతం అమలు చేయడం లేదని ఆరోపించారు. బిసి ప్రధానిగా చెప్పుకుంటున్న మోదీ బిసిలకు చేసింది ఏమిలేదని విమర్శించారు. మోదీ ప్రధానిగా ఉన్న 11 ఏళ్ళలో బిసిలకు చేసింది ఏమిలేదని, ఆర్ఎస్ఎస్, విహెచ్‌పిలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కేంద్రం జనగణనలో కులగణన చేపట్టెందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశంలోని బిసిలంతా ఐక్యమై బిజెపికి తగిన గుణపాఠం చెపుతారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి నేతలు రజిత పటేల్, సరిత, రామారావు, నర్సింహులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆళ్ల రామకృష్ణ హౌస్ అరెస్టు



ఆళ్ల రామకృష్ణను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

**సైఫాబాద్, మే 10 ప్రభాతవార్త:** నేషనల్ ఓబిసి ఇంటెలెక్చ్యువల్ ఫోరం ఛైర్మన్, విశ్రాంత చీఫ్ ఇంజనీర్ ఆళ్ల రామకృష్ణను ఆదివారం ఉదయం పోలీసులు హౌస్ అరెస్టుచేశారు. ఆయన నివాసానికి పోలీసులు పెద్దఎత్తున చేరుకుని ఇంట్లోనే నిర్బంధించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు జనగణనలో ఓబిసి కాలమ్ చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ శనివారం నుంచి ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే. హనుమంతరావుకు మద్దతుగా ఆళ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం పెద్దఎత్తున ర్యాలీ చేపట్టి సంఘీభావం తెలియజేశారు. హనుమంతరావుకు మద్దతుగా బిసి సంఘాలతో కలిసి నేడూ పెద్దఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించేందుకు ఆళ్ల రామకృష్ణ సన్నద్ధమవుతున్నారు. కాగా ప్రధాని నరేంద్రమోదీ రాక సందర్భంగా నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆళ్లను పోలీసులు హౌస్ అరెస్టుచేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బిసిలపట్ల మొండివైఖరి అవలంబిస్తూ వివక్ష చూపుతుందన్నారు. నరే ంద్రమోదీ ఓబిసినని చెప్పుకుంటూనే ఆర్ఎస్ఎస్ అజెండాను అమలు చేస్తున్నారని, మోదీ ప్రభుత్వం బిసిల అణిచివేసే కుట్రలకు తెరలేపిందన్నారు. ప్రజాస్వామ్య విలువలను ఖూనీ చేస్తున్న బిజెపికి ప్రజలు తగిన గుణపాఠం చెపుతారని ఆయన హెచ్చరించారు.

## బండి రమేష్‌కి అభినందనలు వెల్లువ



కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ రమేష్‌ను అభినందిస్తున్న సంఘం సభ్యులు

**కెపిహెచ్‌బి కాలనీ, మే 10, ప్రభాతవార్త :** కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన బండి రమేష్‌కి అభినందనలు వెల్లువ కొనసాగుతోంది. నియోజకవర్గ పరిధిలోని బాలాజీ నగర్ కమ్మ సంఘంతో పాటు ఈసీఐఎల్ సంఘం నాయకులు ఆదివారం బండి రమేష్‌ని నియోజకవర్గ పార్టీ కార్యాలయం హేమ దుర్గాభవన్‌లో కలిసి పూలబొకే ఇచ్చి శాలువా కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బాలాజీనగర్‌లో నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. కాలనీ సమస్యలను పరిష్కరించేందుకు త్వరలో పాదయాత్ర నిర్వహిస్తానని రమేష్ తెలిపారు.

## బ్రెయిన్ డెడ్ యువకుడి అవయవదానం

**జూబ్లీహిల్స్, మే 10, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్‌డెడ్ అయిన యువకుడి కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకొచ్చారు. అంబర్‌పేటకు చెందిన చీరాల సంకీర్త్(21) గత నెల 25 తేదీన నాగోల్ వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదానికి గురై తలకు తీవ్ర రక్తస్రావమైంది. ప్రాథమిక చికిత్స అనంతరం కుటుంబ సభ్యులు బంజారాహిల్స్‌లోని సిటీన్యూరో ఆస్పత్రికి సంకీర్త్‌ను తరలించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న సంకీర్త్‌కు న్యూరో సర్జికల్ నిపుణులు అత్యవసర శస్త్ర చికిత్సలు చేసినప్పటికి ఫలితం లేకపోయింది. అతని శరీరం వైద్యానికి సహకరించకపోవడంతో ఈ నెల 9వ తేదీన బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించారు. సంకీర్త్ తల్లిదండ్రులు చీరాల రవిప్రకాశ్, తల్లి చీరాల శ్రీదేవి కుమారుడు చనిపోయినప్పటికి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి అవయవాలు దానం చేయాలని నిర్ణయించి ముందుకొచ్చారు. సిటీన్యూరో వైద్యుల జీవన్‌దాన్ విభాగానికి సమాచారం ఇచ్చి సంకీర్త్ అవయవాలను దానం చేయించారు. ఈ సందర్భంగా అవయవదానానికి ముందుకొచ్చిన తల్లిదండ్రులను వైద్యులు అభినందించారు.

### తలసీమియా వ్యాధిపై అవగాహన కల్పించాలి : చంద్రకాంత్ అగర్వాల్

**చార్మినార్, మే 10 ప్రభాతవార్త :** తలసీమియా వ్యాధి పట్ల ప్రజలలో అవగాహన కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉందని తలసీమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ అధ్యక్షులు చంద్రకాంత్ అగర్వాల్ అన్నారు. ప్రపంచ తలసీమియా వ్యాధి దినోత్సవం సందర్భంగా ఆదివారం రాఘవేంద్రనగర్ కాలనీలలోని టిసిఎస్‌సి భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తలసీమియా అండ్ సికిల్ సెల్ సొసైటికి సహాయం అందించిన పలువురికి ఆయన మెమొంటోలు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా చంద్రకాంత్ అగర్వాల్ మాట్లాడుతూ ఉచితంగా సొసైటీ తరుపున తలసీమియా వ్యాధిగ్రస్థులకు మందులు అందజేయటంతో పాటు బ్లడ్‌ను ఎక్కిస్తున్నామని తెలిపారు. ప్రజలు తలసీమియా వ్యాధి పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మల్లేశం, సొసైటీ ప్రతినిధులు కె.రత్నావల్లి, డాక్టర్ సుమన్ జైన్, అలీంబేగ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

### రాజీవ్ గృహకల్ప కాలనీలో ఉచిత వైద్య శిబిరం

**దుండిగల్, మే 10, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో బికెఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 36వ ఉచిత వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా ఫౌండేషన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ప్రోటోకాల్ కోఆర్డినేటర్ కమిటీ వైస్ ఛైర్మన్ బొంగునూరి కిషోర్‌రెడ్డి హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సహకరించిన సీఎంఆర్ హాస్పిటల్ వైద్య బృందానికి, బిగ్ న్యూస్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏఆర్ సాదు యాదవ్, నరసింహారెడ్డి, గజేంద్ర, ప్రజా గాయకుడు శంకర్, శ్రీశైలం యాదవ్, అరుణ్ రెడ్డి, జగన్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రాజీవ్ గృహకల్ప కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు.

# నూతన ఆదాయ పన్ను చట్టం పన్ను చెల్లింపుదారులకు అనుకూలం

### సంజయ్ బహదూర్, సురేష్ బత్తిని



మెగా అవుట్ రీచ్ కార్యక్రమంలో పాల్గొన్న సంజయ్ బహదూర్, సురేష్ బత్తిని

**హైదరాబాద్, మే 10 ప్రభాతవార్త :** ఆదాయ పన్ను శాఖ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ టాక్స్ బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నూతన ఆదాయ పన్ను చట్టం -2025పై మెగా అవుట్ రీచ్ కార్యక్రమం నిర్వహించింది. "ప్రారంభ్ 2026" పేరుతో మెగా అవుట్ రీచ్ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిబిడిటి సభ్యులు సంజయ్ బహదూర్, ప్రత్యేక అతిథిగా ఏపీ, తెలంగాణ ప్రధాన ఆదాయ పన్ను కమిషనర్ సురేష్ బత్తిని హాజరై జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిధులను అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ అవుట్‌రీచ్ కార్యక్రమంలో పన్నుల నిపుణులు, శాఖ అధికారుల మధ్య నూతన ఆదాయ పన్ను చట్టం ముఖ్య అంశాలు, అమలు విధానంపై జరిగిన చర్చల్లో 150 మందికి పైగా చార్టర్డ్ అకౌంటెంట్లు, న్యాయవాదులు, పన్ను నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజయ్ బహదూర్ మాట్లాడుతూ, నూతన ఆదాయ పన్ను చట్టం పన్ను చెల్లింపుదారులకు మరింత అనుకూలంగా ఉండేలా, సులభంగా అర్థమయ్యే విధంగా రూపొందించబడిందని, క్లిష్టతలను తొలగించే దిశగా ఇది ముఖ్యమైన అడుగని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు శాఖ, పన్ను నిపుణుల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, సంబంధిత వర్గాలలో అవగాహన పెంపొందించడంలో సహాయపడతాయని అయన అన్నారు. సురేష్ బత్తిని మాట్లాడుతూ పన్ను చెల్లింపుదారులు, ఇతర భాగస్వాములకు ఎల్లప్పుడూ సహకారం అందించేందుకు శాఖ సిద్ధంగా ఉంటుందని, నవీకరించిన పోర్టల్ సేవలు, చాట్‌బాట్ సదుపాయాల ద్వారా సేవలను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు. ఏపీ, టిజీ టాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ వేముల మాట్లాడుతూ నూతన ఆదాయ పన్ను చట్టం-2025 అమలుకు సంబంధించి అవగాహన కల్పించేందుకు ఆదాయ పన్ను శాఖ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అభినందించారు. పన్ను పరిపాలన సమర్థవంతంగా కొనసాగేందుకు, పన్ను చెల్లింపుదారులకు అవగాహన పెంపొందించేందుకు శాఖ, పన్ను నిపుణుల మధ్య సమన్వయం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సలహాదారులు రాందేవ్ బుట్టడా కుమార్ కోట, కార్యదర్శి ఆశిష్ జోషి, ఉపాధ్యక్షులు పి.వి. నారాయణ రావు, జనరల్ కౌన్సిల్ సభ్యులు సోమేశ్వర్, బొజ్జ మధుసూదన్, ప్రకాష్ చోకూడా, ఏపీ దహిమా, రమణ రెడ్డి, శైలేంద్ర శర్మ ఎన్.వి. చారి, పి.ఎస్. చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.




కేబీఆర్ ఉద్యానవనం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న పర్యావరణ ప్రేమికులు

## 'కెబిఆర్' ఎదుట పర్యావరణ ప్రేమికుల ఆందోళన

**జూబ్లీహిల్స్, మే 10, ప్రభాతవార్త :** ప్రధాని మోడి పర్యటన నేపథ్యంలో కేబీఆర్ ఉద్యానవనం చుట్టూ చెట్ల నరికివేతను నిరిసిస్తూ క్యాన్సర్ ఆసుపత్రి కూడలిలో పలువురు పర్యావరణ ప్రేమికులు ఆందోళనకు దిగారు. చెట్ల నరికివేతను నిలిపివేయాలని, ఎకో సెన్సిటివిటీ జోన్‌లో చెట్లను నరకవద్దని వారు నినాదాలు చేశారు. ప్లకార్డులు పట్టుకొని తమ ఆందోళనను వ్యక్తం చేశారు. మానవహారంగా ఏర్పడి సేవ్ కేబీఆర్ అంటూ కోరారు.

## అమ్మకు ప్రేమను పంచండి : ఎమ్మెల్యే



వృద్ధురాలికి చీర అందిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

**అల్వాల్, మే 10 ప్రభాతవార్త:** సృష్టికర్తలు తల్లులను ప్రతి ఒక్కరూ గౌరవించాల్సిన అవసరం ఉందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మదర్స్‌డేను పురస్కరించుకుని మచ్చబొల్లారం హనుమాన్ టేక్డీలోని శ్రీ శంకర శశాంక చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ డార్టర్ రజని ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా విచ్చేశారు. సమాజ నిర్మాణంలో అమ్మలు పాత్ర కీలకమైనదని ఆయన పేర్కొన్నారు. గౌరవ మర్యాదలు, ప్రేమను తల్లికి పంచాలని ఆయన కోరారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలలో బిఆర్ఎస్ నేతలు డోలి రమేష్, పరమేష్, శరణ్ గిరి, హేమంత్ పటేల్, సాయి గౌడ్, స్వరూప, హరిత పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడి చదవాలి

### రాష్ట్ర గ్రంధాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్

**చార్మినార్, మే 10 ప్రభాతవార్త :** పాతబస్తీ మొగల్‌పురలోని రాగా ఎడ్యుకేషనల్ ఆకాడమీ కాన్ఫరెన్ హాల్‌లో ఆదివారం టిఎస్ మెసా ఉర్దూ ఆఫీసర్స్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్ పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన 50 విద్యార్థులకు మెమొంటోలు, ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర గ్రంధాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే తప్పకుండ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో టిఎస్ మెసా రాష్ట్ర అధ్యక్షులు ఫారూఖ్ అహ్మద్, అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్.ఎంఎ నయిమ్, రాష్ట్ర జాయింట్ కార్యదర్శి తాసుద్దీన్, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తౌఫీకుర్ రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినీకి మెమొంటోను ప్రదానం చేస్తున్న రాష్ట్ర గ్రంధాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్



సెంట్రింగ్ కార్మికుల బంద్‌కు మద్దతు తెలుపుతున్న బిఆర్ఎస్ నేతలు

## భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి

### బిఆర్ఎస్ మణికొండ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ

**నార్సింగి, మే 10 ప్రభాతవార్త :** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలని మణికొండ బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ పేర్కొన్నారు. ఆదివారం సెంట్రింగ్ కార్మికుల బంద్‌కు బిఆర్ఎస్ నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ హెచ్ఎండిఏ పరిధిలో జరుగుతున్న 70.శాతం పనులలో స్థానిక కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, నిర్మాణ కార్మిక సంక్షేమ నిధులను వెంటనే కార్మిక సంక్షేమానికి వినియోగించాలని, ప్రమాద మరణ పరిహారంను రూ. 20.లక్షలకు పెంచాలని, వృద్ధ కార్మికులకు రూ.3.వేల పించన్ ఇవ్వాలని, అర్హులైన వారికి ఇఎస్ఐ, ఆరోగ్య కార్డులు, ప్రమాద భీమా అమలు చేయాలని, సెంట్రింగ్ పనులకు చదరపు అడుగుకు రూ.51. ధరను ప్రమాణీకరించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు మేలు జరిగేంత వరకు బిఆర్ఎస్ తరపున అండగా నిలుస్తామని సీతారాం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు కృష్ణా, అశోక్, శ్రీనివాస్, రాములు, విఠల్ పాల్గొన్నారు.

### కాలనీ అభివృద్ధికి పాటుపడాలి : తలసాని

**అడ్డగుట్ట, మే 10 ప్రభాతవార్త:** ప్రజలకు అందుబాటులో ఉంటూ కాలనీల అభివృద్ధికి అసోసియేషన్ ప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్ నగర్‌లోని అల్లాహుద్దీన్ కోటీ నూతన అధ్యక్షుడు అస్రఫ్‌అలీ, కార్యదర్శి వసీన్ ఖాన్ ఎన్నికైన సందర్భంగా ఆదివారం మారేడ్‌పల్లిలోని తలసాని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బాల్‌రెడ్డి, సురేష్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, ఖలీల్ పాల్గొన్నారు.

## విద్యార్థుల ఎదుగుదలకు హోమం

**ముషీరాబాద్, మే 10, ప్రభాతవార్త:** విద్యార్థులలో విద్యాపరంగా, విలువల పరంగా సంపూర్ణ ఎదుగుదల కోసం నిర్వహించేదే విద్యార్థి హోమం అని రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి బోదమయానంద తెలిపారు. ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణమఠంలో విద్యార్థి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి బోదమయానంద మాట్లాడుతూ విద్యార్థి హోమం పిల్లల చదువు, నడవడిక, ఏకాగ్రత మరియు సంపూర్ణ శ్రేయస్సు కోసం నిర్వహించే ఒక పవిత్రమైన, శక్తివంతమైన సంప్రదాయమని పేర్కొన్నారు. హోమం సమయంలో విద్యార్థులు ఆలోచనా శుద్ధి, క్రమశిక్షణ, ఏకాగ్రత, తల్లి తండ్రులు, ఉపాధ్యాయుల పట్ల గౌరవం, మంచి నడవడిక ఏర్పడాలని పవిత్ర మంత్రాలు జపిస్తారని, రామకృష్ణమఠంలోని ఆధ్యాత్మిక చైతన్యవంతమైన వాతావరణంలో ఈ హోమం నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ హోమం సందర్భంగా ముందుగా విద్యార్థులు మొదటి గురువులుగా భావించే తమ తల్లి తండ్రులకు పాదపూజ చేస్తారని, పాదపూజ చేయటం ద్వారా తల్లి తండ్రుల పట్ల కృతజ్ఞత, వినయం, గౌరవం, ప్రేమ పెంపొందుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లి తండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



విద్యార్థులను ఆశీర్వదిస్తున్న స్వామి బోదమయానంద

# గ్రామ పాలన అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి

### టిజిఇ జెఏసి చైర్మన్ లచ్చిరెడ్డి




మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

**చిక్కడపల్లి, మే 10 (ప్రభాతవార్త) :** రాష్ట్రంలోని గ్రామపాలన అధికారుల న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, దీనిపై త్వరలో ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని టీజీఈ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి పేర్కొన్నారు. సీసీఎల్ఏ కార్యాలయ ఆవరణలోగల డీసీఏ కార్యాలయంలో గ్రామపాలన ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్ర రావు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా వి. లచ్చిరెడ్డితో పాటు డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ హాజరయ్యారు. లచ్చిరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ స్థాయిలో కీలక పాత్ర పోషిస్తున్న అధికారుల సమస్యలను పరిష్కరించేందుకు తమ జేఏసీ పూర్తి మద్దతు ఇస్తుందని హామీ ఇచ్చారు. రికార్డ్ అసిస్టెంట్ వేతనాలతో విధులు నిర్వహిస్తున్నవారికి జూనియర్ అసిస్టెంట్ ప్రమోషన్లు కల్పించాలి, సర్వీస్ క్రమబద్ధీకరణ, ప్రొబేషన్ డిక్లరేషన్ పెండింగ్‌లో ఉన్న వారికి వెంటనే పూర్తి చేయాలి, ఆన్‌లైన్ ద్వారా ధ్రువీకరణ పత్రాల విచారణ, అప్‌లోడ్ బాధ్యతలు పెరిగినందున అందరికీ ల్యాప్‌టాప్‌లు లేదా ట్యాబ్‌లు పంపిణీ చేయాలి, శాఖాపరమైన పరీక్షలు, సర్వే శిక్షణను జిల్లా కేంద్రాల్లోనే నిర్వహించాలి, మెడికల్ గ్రౌండ్స్, పరస్పర బదిలీలు మరియు ఒంటరి మహిళా ఉద్యోగుల బదిలీలు చేపట్టాలి, ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక ఆఫీసర్ కార్యాలయాన్ని నిర్మించాలి.

అలాగే ఖాళీగా ఉన్న గ్రామ పాలన సహాయకుల పోస్టులను భర్తీ చేయాలి, రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన జేఏసీ నేత లకు కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అర్జున్ మల్లారం, సెక్రటరీ జనరల్స్ లక్ష్మీనరసింహులు, దాసరి వీరన్న, అసోసియేట్ అధ్యక్షులు చంద్రయ్య, చిరంజీవి, కోశాధికారి బాలకృష్ణ, మహిళా నాయకురాలు స్వాతి, శివరంజని, శోభ, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మోండా డివిజన్ నుంచి మోదీ సభకు తరలి వెళ్తున్న బిజెపి శ్రేణులు

## ప్రధాని సభకు తరలివెళ్లిన బిజెపి శ్రేణులు

**కంటోన్మెంట్, మే 10 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం తలపెట్టిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభకు మోండా డివిజన్ మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక ఆధ్వర్యంలో వందలాది మంది బిజెపి శ్రేణులు తరలివెళ్ళారు. బిజెపి జెండాలు పట్టుకుని మండు టెండలను లెక్క చేయకుండా కుమ్మరిగూడ, మారేడ్‌పల్లి రెజిమెంటల్ బజార్, ఆదయ్య నగర్ ప్రాంతాల నుంచి పరేడ్ గ్రౌండ్‌కు తరలి వెళ్ళారు.

### హెచ్ఎంటీనగర్ నుంచి...



మోడి సభకు వెళ్లే బస్సును ప్రారంభిస్తున్న మల్లెల నర్సింగ్‌రావు

**నాచారం, మే 10 ప్రభాతవార్త :** సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన ప్రధాని నరేంద్ర మోదీ సభకు నాచారం ప్రాంతానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల నర్సింగరావు ఆధ్వర్యంలో హెచ్ఎంటి నగర్ నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి కార్యకర్తలను సభకు పంపించారు. ఈ సందర్భంగా మల్లెల నర్సింగరావు మాట్లాడుతూ దేశ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో ప్రధాని మోదీ నాయకత్వం దేశాన్ని ముందుకు తీసుకెళ్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవీన్, అభిషేక్‌గౌడ్, ప్రకాష్, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

### బిజెపి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో...



సభను బయలుదేరిన దేవర శ్రీనివాస్, నాయకులు

**కార్వాన్, మే 10(ప్రభాతవార్త) :** సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం నిర్వహించిన ప్రధాని మోదీ బహిరంగసభకు బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవర శ్రీనివాస్ ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్ డివిజన్ తాళ్లగడ్డ కబడ్డీ స్టేడియం వద్ద నుండి భారీ సంఖ్యలో బీజేపీ నాయకులు, ప్రజలు బయలెల్లినారు. కార్యక్రమంలో నాయకులు అనుయాదవ్, నామయాదగిరి, రాజేష్, మల్లేష్, కిషోర్, సంగయ్య, శ్రీధర్, బుచ్చి తదితర నాయకులు ఉన్నారు.

### కిస్మత్‌పూర్ డివిజన్ నుంచి...



కిస్మత్‌పూర్ డివిజన్ నుంచి బయలుదేరుతున్న నాయకులు

**నార్సింగి, మే 10 ప్రభాతవార్త :** ప్రధాని నరేంద్రమోడీ సభకు రాజేంద్ర నగర్ సర్కిల్ పరిధిలోని కిస్మత్‌పూర్ డివిజన్ నుంచి భారీ ఎత్తున బిజెపి నాయకులు, శ్రేణులు తరళి వెళ్లారు. రాష్ట్ర నాయకులు మహాలింగంగౌడ్, భీమార్జున్‌రెడ్డి, నీరుడు శేఖర్ ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో వందలాది మంది కార్యకర్తలు జైశ్రీరాం...జైజై శ్రీరాం... నరేంద్రమోడీ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ, కాషాయ జెండాలు ఎగురవేస్తూ సభకు వెళ్లారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు నీరుడు శేఖర్‌ముదిరాజ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో భారతదేశం మరోమారు విశ్వగురువుగా అవతరించబోతుందన్నారు. మోదీ ఉన్నారన్న భరోసాతో దేశ ప్రజలు విచ్ఛిన్నకర శక్తులను ఎన్నికల్లో ఓడించి పాతాళానికి తొక్కేస్తున్నారన్నారు. అసాధ్యమనుకున్న పశ్చిమ బెంగాల్‌లో కాషాయ జెండాను ఎగుర వేయడం జరిగిందని, ఇక తెలంగాణాలో సైతం కాషాయ జెండాను పాతడం ఖాయమన్నారు. రోజులో 18.గంటల పాటు దేశ అభ్యున్నతి కోసం పరితపిస్తున్న మహానేత ప్రధాని నరేంద్రమోడీ అని కొనియాడారు. ఆయన నాయకత్వంలో పని చేసే అవకాశం మాకు దక్కడం గర్వంగా ఉందన్నారు. మోడీ సభకు తరలి వెళ్లిన వారిలో పవన్‌సాయి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్, స్వామి శేఖర్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

## బండి సాయిభగీరథ్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణ జరపాలి : మహిళా సంఘాల డిమాండ్

**పేట్‌బషీరాబాద్, మే 10, ప్రభాతవార్త :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై వచ్చిన ఆరోపణలపై పూర్తిస్థాయి, నిష్పక్షపాత విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాలని మహిళా సంఘాలు డిమాండ్‌చేశాయి. బాధిత మైనర్ బాలికకు రక్షణ కల్పించి, న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరాయి. బేటీ బచావో - బేటీ పడావో అంటూ నినాదాలు చేస్తున్న బీజేపీ ప్రభుత్వం మహిళల భద్రత విషయంలో మాటలకే పరిమితం కాకుండా, చర్యల్లో తమ నిబద్ధతను నిరూపించాలని మహిళా నాయకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ముందు మహిళా సంఘాలు ధర్నా నిర్వహించాయి. రాజకీయ ప్రభావంతో కేసులను నీరుగార్చే ప్రయత్నాలు ఆపాలని, బాధితురాలికి న్యాయం జరిగే వరకు తమ న్యాయ పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర మహిళా నాయకురాలు పావని గౌడ్, మెట్టుగూడ మాజీ కార్పొరేటర్ రాసూరి సునీత, శైలజ, సరిత, గుంటీ మంజుల రాణి, గాదె స్రవంతి, అరుణా రెడ్డి తదితర మహిళా సంఘాల నాయకురాళ్లు, స్థానిక మహిళలు, మద్దతుదారులు పాల్గొన్నారు.




నినాదాలు చేస్తున్న మహిళా సంఘాలు



సభలో కమలదండు కోలాహలం



షాద్‌నగర్ నుంచి మోడీ సభకు బస్సులో వెళుతున్న విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు



మోడీ తల్లి పాదలను కడుగుతున్న చిత్రాన్ని సభలో ప్రదర్శిస్తున్న అభిమాని




# కమల దళం కదంతొక్కె..

**నమో నామస్మరణతో మారుమోగిన సభా ప్రాంగణం!**

**ప్రధాని మోడీ గర్జనను వినడానికి భారీగా తరలివెళ్లిన బిజెపి సైన్యం**

**కాషాయమయమయిన రహదారులు**

**దారిపొడవునా జై హో మోడీ నినాదాలు**

దేశ ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభ నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. మోడీ ప్రసంగాన్ని వినేందుకు, ఆయనకు సంఘీభావం తెలిపేందుకు కాషాయ దళం భారీ ఎత్తున కదిలివచ్చింది. వివిధ జిల్లాల నుండి భారీ సంఖ్యలో బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రత్యేక వాహనాల్లో సభా స్థలికి చేరుకున్నారు. మోడీ రాకతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

**మేడ్చల్/యాచారం/శామీర్‌పేట,/షాద్‌నగర్, మే 10, ప్రభాతవార్త :** సికింద్రాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ బహిరంగ సభకు మేడ్చల్ ఉమ్మడి మండలం నుండి బిజెపి నాయకులు తరలివెళ్లారు. మేడ్చల్ పట్టణం నుండి మున్సిపల్ అధ్యక్షురాలు శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో నాయకులు పలు వాహనాలు, బస్సుల్లో తరిలివెళ్లగా ఎల్లంపేట మున్సిపాలిటీ నుండి మున్సిపల్ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. యాచారం మండలం నుండి అత్యధిక సంఖ్యలో బిజెపి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లి తమ రాజకీయ ఐక్యతను, పార్టీ పట్ల ఉన్న నిబద్ధతను చాటిచెప్పారు. మండల బిజెపి అధ్యక్షులు విజయ్ నాయక్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని అన్ని గ్రామాల నుండి దాదాపు 500 మందికి పైగా కార్యకర్తలు, యువ నాయకులు, మహిళా కార్యకర్తలు, గ్రామస్థాయి బిజెపి నాయకులు స్వచ్ఛందంగా సభకు హాజరయ్యారు. భారీ కాన్వాయ్‌లతో, బిజెపి జెండాలు, నినాదాలతో సభ ప్రాంగణానికి చేరుకున్న కార్యకర్తలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి, పేదల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వం దేశాన్ని ప్రపంచస్థాయిలో గౌరవప్రద స్థానంలో నిలబెట్టిందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనేక కీలక ప్రాజెక్టులు, రహదారులు, రైల్వేలు, విద్యాసంస్థలు, సంక్షేమ పథకాలు అందించిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు ప్రస్తుతం మార్పును కోరుకుంటున్నారని, గ్రామస్థాయిలో బిజెపికి రోజురోజుకు విపరీతమైన ఆదరణ పెరుగుతోందని నాయకులు అభిప్రాయపడ్డారు. గ్రామాల నుండి యువత, మహిళలు, రైతులు, కార్మికులు స్వచ్ఛందంగా రావడం ప్రత్యేక విశేషంగా నిలిచింది.



శామీర్‌పేట నుంచి తరలివెళుతున్న బిజెపి నాయకులు, కార్యకర్తలు

నగరంలోని సికింద్రాబాద్ పేరెడ్ గ్రౌండ్‌లో జరిగిన ప్రధాని నరేంద్రమోడీ బహిరంగసభకు శామీర్‌పేట డివిజన్, అలియాబాద్ మున్సిపాల్టీ, మూడుచింతలపల్లి మున్సిపాల్టీ ఆయా మండలాల నుంచి బిజెపి నాయకులు, కార్యకర్తలు పలువురు వాహనాల్లో తరలివెళ్లారు. ఆదివారం శామీర్‌పేట డివిజన్, (మండలం)లోని వివిధ గ్రామాల నుంచి, అలియాబాద్ మున్సిపాల్టీ నుంచి, మూడుచింతలపల్లి (మున్సిపాల్టీ) మండలంలోని వివిధ గ్రామాల నుంచి బిజెపి శ్రేణులు బస్సుల్లో బయలుదేరారు. శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు కొరివి కృష్ణముదిరాజ్ ఆధ్వర్యంలో అలియాబాద్ మున్సిపల్ వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి తదితరులు, శామీర్‌పేట-డివిజన్ తూంకుంట నుంచి మాజీ ఎంపిపి బి.చంద్రశేఖర్‌యాదవ్, పార్టీ అధ్యక్షులు పి.నర్సింహ్మారెడ్డిల ఆధ్వర్యంలోను, మూడుచింతలపల్లి మండలం నుంచి బిజెపి అధ్యక్షులు టి.నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలోను పెద్ద ఎత్తున వాహనాలు తరలివెళ్లాయి. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న శ్రీ నరేంద్రమోదీ బహిరంగ సభకు ఫరూఖ్ నగర్ మండలం కార్యకర్తలతో బయలుదేరిన బిజెపి సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి తదితర నాయకులు వెళ్లారు. ఫరుక్ నగర్ మండల నుంచి బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కక్కునూరి వెంకటేష్ గుప్తా, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కందూరి మనోహర్ రెడ్డి, ఫరూక్ నగర్ బిజెపి మండల అధ్యక్షులు పిట్టల సురేష్ కార్యకర్తలు బూత్ అధ్యక్షులు శక్తి కేంద్ర ఇన్చార్జిలతో కలిసి పరేడ్ గ్రౌండ్స్‌కు బయలుదేరారు.



మేడ్చల్ నుండి బయలు దేరిన బిజెపి నాయకులు



యాచారం నుంచి..

# పాపాల భైరవులు



**కందుకూరు, మే 10, ప్రభాతవార్త:** పాల స్వచ్ఛతను కాపాడాల్సింది పోయి, కేవలం లాభాపేక్షతో వినియోగదారుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న ఒక పాల వ్యాపారి ఉదంతం కందుకూరులో వెలుగులోకి వచ్చింది. పాలు పాడవకుండా ఉండేందుకు ప్రమాదకరమైన హైడ్రోజన్ పెరాక్సైడ్ కెమికల్‌ను కలుపుతున్న మరామోని శ్రీశైలం అనే వ్యాపారిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలలోకి వెళితే.. దసర్లపల్లి గ్రామానికి చెందిన శ్రీశైలం చుట్టుపక్కల రైతుల నుంచి పాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించి విక్రయిస్తుంటాడు. సాధారణంగా మధ్యాహ్నం సేకరించిన పాలు రాత్రికి పాడవకుండా ఉండాలంటే ఫ్రిజ్‌లో ఉంచి భద్రపరచాలి.

**కందుకూరులో కల్తీ పాల కేంద్రం సీజ్**

**ఫ్రిజ్ వాడితే విద్యుత్ బిల్లు వస్తుందని ప్రజల ప్రాణాలతో చెలగాటం**

**పాలు విరిగిపోకుండా ప్రమాదకర రసాయనాల వినియోగం**

**పాల కేంద్రంపై పోలీసుల మెరుపు దాడి**

**భారీగా హైడ్రోజన్ పెరాక్సైడ్ స్వాధీనం**

**నిందితుడు శ్రీశైలం అరెస్ట్**

మనం తాగే పాలు మన ప్రాణాలనే తీస్తున్నాయా? కొంతమంది కేటుగాళ్ల మాయాజాలం చూస్తుంటే అవుననే సమాధానం వస్తోంది. హైదరాబాద్ శివార్లలోని కందుకూరు మండలంలో దారుణమైన కల్తీ పాల దందా వెలుగులోకి వచ్చింది. పాలను నిల్వ ఉంచేందుకు ఫ్రిజ్‌లు వాడాల్సి ఉండగా, కరెంటు బిల్లులు మిగుల్చుకోవాలనే దురాశతో ఓ వ్యాపారి ఏకంగా హైడ్రోజన్ పెరాక్సైడ్ వంటి ప్రమాదకర రసాయనాలను పాలలో కలుపుతున్నాడు. నమ్మకంతో పాలు కొనే వినియోగదారుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ ముఠా గుట్టును కందుకూరు పోలీసులు రట్టు చేశారు.

అయితే, ఫ్రిజ్ వాడితే కరెంటు బిల్లు ఎక్కువ వస్తుందన్న దురాశతో, అతను ఒక లీటరు కెమికల్ బాటిల్‌ను తక్కువ ఖర్చుతో కొనుగోలు చేసి, ఆ ద్రావణాన్ని పాల డబ్బాల్లో కలిపేవాడు. విశ్వసనీయంగా సమాచారం అందుకున్న కందుకూరు సీఐ వెంకటేశ్వర్లు తన బృందంతో కలిసి పాల కేంద్రంపై దాడి చేశారు. హైడ్రోజన్ పెరాక్సైడ్ కలిపిన 3 పాల క్యాన్లను స్వాధీనం చేసుకున్నారు. కల్తీకి ఉపయోగిస్తున్న కెమికల్ ద్రావణాన్ని సీజ్ చేశారు. నిందితుడు శ్రీశైలంను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, హైడ్రోజన్ పెరాక్సైడ్ లాంటి కెమికల్స్ కలిపిన పాలు తాగడం వల్ల కిడ్నీ సంబంధిత వ్యాధులు, జీర్ణకోశ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కేవలం సొంత లాభం కోసం సామాన్య ప్రజల ప్రాణాలను పణంగా పెట్టడం అమానుషమని ఆయన మండిపడ్డారు. ఎవరైనా ఇలాంటి నిషేధిత పదార్థాలను కలిపి విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ కోరారు. నిందితుడిపై కఠిన చట్టాల కింద చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# అడవి వదిలి ఊరు చేరి




**★ కూలీల వేషంలో దళ సభ్యులు!**

**★ రుక్మాపూర్ రైల్వే ట్రాక్ పనుల్లో కలకలం**

**★ ముప్పై యేళ్ల తర్వాత మావోల కదలిక**

**★ మహారాష్ట్ర ఖాకీల ఆపరేషన్ సక్సెస్**

**★ ప్రాణరక్షణ కోసం వచ్చారా? విద్రోహ చర్యలకు స్కెచ్ వేశారా?**

**★ లోతుగా విచారిస్తున్న పోలీసులు**

**★ ఉలిక్కిపడ్డ వికారాబాద్ జిల్లా**

**★ అప్రమత్తమైన జిల్లా పోలీస్ యంత్రాంగం**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** సుమారు మూడు దశాబ్దాల తర్వాత మావోయిస్టుల కదలికలతో ఒక్కసారిగా జిల్లా ఉలిక్కి పడింది. వివరాలలోకి వెళితే.. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం రుక్మాపూర్ రైల్వే స్టేషన్ పరిసరాల్లో రైల్వే ట్రాక్ పనులు జరుగుతున్నాయి. 10 రోజుల క్రితమే కొంతమంది కొత్త వ్యక్తులు కూలీలుగా వచ్చి చేరారు. వీరి కదలికలు అనుమానాస్పదంగా ఉన్నా యన్న పక్కా సమాచారంతో మహారాష్ట్రలోని గచ్చిరౌలి పోలీసులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శనివారం అర్ధరాత్రి తాండూరుకు చేరుకున్నారు. వీరిలో మెరికల్లాంటి 15 మంది సాయుధులు ఉన్నారు. వికారాబాద్ జిల్లా పోలీసుల సహకారంతో ఎవరికీ అనుమానం రాకుండా పౌర దుస్తుల్లో వెళ్లిన ప్రత్యేక బృందాలు రైల్వే ట్రాక్ వద్ద పనిచేస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు.

**ఛత్తీస్‌గఢ్ నుంచి రుక్మాపూర్‌కు..**

అరెస్టయిన వారు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గచ్చిరౌలి ప్రాంతానికి చెందిన మావోయిస్టులుగా పోలీసులు గుర్తించినట్టు తెలుస్తోంది. ఆ ప్రాంతం లో గత కొన్ని రోజులుగా పోలీసుల నిఘా పెరగడం, వరుస ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లు జరుగుతుండటంతో ప్రాణ రక్షణ కోసం వీరు బతుకుదెరువు పేరుతో ఈ ప్రాంతానికి వచ్చినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

వీరు కేవలం ప్రాణరక్షణ కోసం వచ్చారా? లేక ఇక్కడ ఏదైనా విద్రోహ చర్యలకు స్కెచ్ వేశారా? అనే కోణంలో పోలీసులు లోతుగా విచారిస్తున్నారు. నిన్న మొన్నటి వరకు అడవిని నమ్ముకున్న వీరు, ఇప్పుడు ఇలా కూలీల వేషంలో పట్టుబడటం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రస్తుతం నిందితులను తదుపరి విచారణ నిమిత్తం ఉన్నతాధికారులు రహస్య ప్రాంతానికి తరలించినట్లు తెలుస్తోంది.

**జిల్లా పోలీసుల నిఘా వైఫల్యమా?**

ఈ సంఘటనతో జిల్లా ప్రజలు ఒక్కసారిగా కలవరానికి గురైనారు. స్థానికంగా తీవ్ర అలజడిని సృష్టించింది. ప్రత్యేకించి తెలంగాణ పోలీసులకు సవాలు విసిరినట్లయింది. కూలీలుగా చేరిన మావోయిస్టుల వద్ద ఎలాంటి ఆయుధాలు లేనందున కాల్పుల శబ్దం లేకుండా పోలీసులు పట్టుకోగలిగారు. నలుగురిలో ఓ మహిళా నక్సలైట్ కూడా ఉండటం గమనార్హం. సంఘ విద్రోహ శక్తులతో పాటు మావోయిస్టులు కూడా తాండూరు ప్రాంతాన్ని షెల్టర్‌గా వాడుకుంటున్నారని తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా పోలీసు వ్యవస్థ, నిఘా విభాగం పనితీరును పరిహసింపజేసేలా ఉందన్న విమర్శలు వస్తున్నాయి.

**గతంలోనూ నక్సల్స్‌అలజడి**

1985 నుంచి 1998 వరకు వికారాబాద్ జిల్లాలో నక్సలైట్ల కార్యకలాపాలు జరిగాయి. అప్పట్లో జనశక్తి, పీపుల్స్‌వార్, రెడ్ టైగర్స్ పేరిట సాయుధ నక్సలైట్లు భూస్వాములపై దాడులు జరిపారు. పెత్తందార్లకు వ్యతిరేకంగా పలు పోరాటాలు చేసినా క్రమేణా సంఘాల్లో విభేదాలు నెలకొన్నాయి. పీపుల్స్‌వార్ దళంలో వరంగల్‌కు చెందిన గంగన్న వికారాబాద్, పూడూరు, పరిగి, బంట్వారం, తాండూరు, పెద్దేముల్, ధారూరు ప్రాంతాల్లో విస్తరించారు. పొరుగున ఉన్న కర్నాటకలోని చించోలి, కుంచవరం అడవుల్లో తలదాచుకున్నట్లు ఇప్పటికీ గుర్తు చేస్తుంటారు. పలువురు సర్పంచ్‌ల కిడ్నాప్, కల్లు వ్యాపారులపై దాడులు వంటి సంఘటనలు చోటు చేసుకున్నారు. 1992-93లో ధారూరు మండలం నాగారం అడవుల్లో గంగన్నను పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. అప్పటి నుంచి కార్యకలాపాలు తగ్గుముఖం పట్టాయి. జనశక్తి ఆరంభంలో కొంత ప్రభావం చూపించింది. ర్యాడికల్స్ ప్రభావం యువతపై తీవ్రంగా చూపెట్టింది. తాండూరుకు చెందిన పట్లోళ్ల గోవర్ధన్‌రెడ్డి కూడా కొంతకాలం పాటు నక్సలైట్ ఉద్యమాన్ని నడిపించారు. 1998లో రెడ్‌టైగర్స్‌కు చెందిన ఐదుగురు నక్సలైట్లను బొంరాస్‌పేట మండలం కొత్తూరు ప్రాంతంలో ఎన్‌కౌంటర్ చేయడంతో దళాలు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయాయి. 2004-05లో పట్లోళ్ల గోవర్ధన్‌రెడ్డి కూడా పరిటాల రవి హత్య కేసులో నిందితుడిగా చేర్చారు. కొంతకాలానికి ఆయన కూడా హత్యకు గురైనారు. అయితే, 1998 తర్వాత నక్సల్స్ ప్రభావం పూర్తిగా తగ్గడంతో ప్రజలు వాటి గురించి మరిచిపోయారు. నల్లమల, ఛత్తీస్‌ఘడ్ ప్రాంతాల్లో తరచూ జరిగిన సంఘటనలను మీడియా ద్వారా తెలుసుకోవడం తప్ప ఈ ప్రాంతంలో వారి కదలికల గురించి వినలేదు.



రుక్మాపూర్ రైల్వేస్టేషన్‌లో మావోయిస్టులు తలదాచుకున్న క్వార్టర్లు

**పొరుగు రాష్ట్రాల కూలీలపై ఆరా**

సుమారు పదేళ్లుగా తాండూరు ప్రాంతంలో బీహార్, ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన చాలామంది కూలీలు ఉపాధి పొందుతున్నారు. నాపరాయి, సిమెంట్ కర్మాగారాలే కాకుండా హమాలీలుగా కూడా పని చేస్తున్నారు. స్థానిక కూలీలకు ఇచ్చే రేట్లు గిట్టుబాటు కాకపోవడం, వారు వేళకు సరిగ్గా పనిచేయడం లేదనే కారణం వల్ల పొరుగు రాష్ట్రాల కూలీలకు పనులు కల్పిస్తున్నారు. వరి కోత సమయంలో రైస్‌మిల్లుల వద్ద బీహార్, ఛత్తీస్‌ఘడ్ హమాలీలు ఎక్కువగా పని చేస్తుంటారు. తాజా సంఘటనతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. ఈ సంఘటన నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. పొరుగు రాష్ట్రాల కూలీల గురించి ఆరా తీయనున్నారు.

# వారసత్వ సంపదపై పంజా

**కాకతీయుల చెరువు కట్టను దున్నేస్తున్న జెసిబిలు**

**ప్రజాప్రతినిధుల అండతోనే ఆక్రమణలు**

**చారిత్రక ఎర్రకుంట చెరువును మట్టిపాలు చేస్తారా?**

**సిపిఎం నేతల ఆందోళన**

**హైడ్రా అధికారులకు ఫిర్యాదు**

**యాచారం, మే 10, ప్రభాతవార్త:** కాకతీయుల కాలం నాటి చారిత్రక ఆనవాళ్లను భూస్వాములు మట్టిపాలజేస్తున్నారు. యాచారం మండలం ధర్మన్నగూడ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 155లో గల ఎర్రకుంట చెరువు కట్టను స్థానిక భూస్వాములు జేసీబీలతో ధ్వంసం చేయడం స్థానికంగా కలకలం రేపుతోంది. ఈ అక్రమ ఉదంతాన్ని సిపిఎం బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి. అంజయ్య మాట్లాడుతూ.. నిజాం కాలం కంటే ముందు, కాకతీయుల హయాంలోనే నిర్మితమైన ఈ కుంట ఈ ప్రాంతానికి ప్రాణాధారమని పేర్కొన్నారు. పట్టా భూమిలో ఉందనే నెపంతో, కొందరు ప్రజాప్రతినిధుల సహకారంతో చెరువు కట్టను మొండిగా కూల్చివేశారని ఆరోపించారు. నీరు నిలిచే ప్రాంతాన్ని మట్టితో నింపి ఆక్రమించు కోవడమే కాకుండా, పొలాల నుండి చెరువులోకి వచ్చే నీటి కాలువలను సైతం మూసివేశారని మండిపడ్డారు. దీనివల్ల పశుపక్ష్యాదులకు తాగునీరు కరువై, భూగర్భ జలాలు అట్టడుగుకు వెళ్లే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

మాజీ వైస్ ఎంపీపీ ఎం. శ్రీమన్నారాయణ, మండల కమిటీ సభ్యుడు ఎం. బాల్ రాజ్ మాట్లాడుతూ.. చారిత్రక సంపదను ధ్వంసం చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, ఇరిగేషన్, హైడ్రా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి, ధ్వంసమైన కట్టను పునరుద్ధరించి, పోసిన మట్టిని తొలగించాలన్నారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో బాధితులు, రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శాఖ కార్యదర్శి పి. రమేష్, ఎం. రాములు, ఎన్. సత్తయ్య, ఎం. సత్తయ్య, పి. సత్యనారాయణ, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తవ్వేసిన చెరువును పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

# జనగణనపై అవగాహన వాక్




మార్నింగ్ వాక్‌లో పాల్గొన్న అధికారులు

**వికారాబాద్, ప్రభాతవార్త :** సమగ్ర, ఖచ్చితమైన గణాంకాల రూపకల్పనలో జనగణన కీలకమని, దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జనగణన ప్రక్రియలో అందరూ భాగస్వామ్యులు కావాలని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సత్తార్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం జిల్లా కేంద్రంలోని బ్లాక్ గ్రౌండ్ నుండి ఎన్నెపల్లి చౌరస్తా వరకు మొదటి దశ జనగణనపై నిర్వహించిన అవగాహన వాక్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనుభవజ్ఞులైన సిబ్బందిని జనగణన సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లుగా నియమించి వారికి అవసరమైన శిక్షణ అందించడం జరిగిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి నారాయణ, టీఎంసీ వెంకటేశ్వర్లు, సహాయ సంచాలకులు రవి చంద్ర, ఫిజికల్ డైరెక్టర్ లు, ఎన్యూమరేటరులు, సూపర్ వైజర్లు, టెక్నీకల్ అసిస్టెంట్‌లు, యువత పలు సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆటో బోల్తా: వివాహిత మృతి

**పెద్దేముల్, మే 10: ప్రభాతవార్త:** ఆటో బోల్తా పడి మహిళ మృతిచెందిన సంఘటన పెద్దెముల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శనివారం చోటుచేసుకుంది .పెద్దేముల్ ఎస్ఐ ప్రశాంత్ వర్ధన్ తెలిపిన వివరాలు ప్రకారం, మాన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన నందినికి, చౌడాపూర్ మండలం చిన్న మేఘ్యా నాయక్ తాండాకు చెందిన మెగావత్ సురేష్‌తో మూడేళ్ల క్రితం వివాహం కాగా, వీరు ప్రస్తుతం హైదరాబాద్‌లోని కాళీమందిర్ ప్రాంతంలో నివసిస్తున్నారు.

ఇంట్లో జరిగే ఒక శుభకార్యం నిమిత్తం ఈ నెల 8న వీరు స్వగ్రామానికి వచ్చారు. శనివారం మధ్యాహ్నం నందిని తన భర్తతో కలిసి ఆటోలో తాండూర్‌కు షాపింగ్ కోసం బయలుదేరగా, చైతన్య నగర్ గ్రామ శివారులో భర్త సురేష్ ఆటోను అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపడం వల్ల వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయ పడిన నందినిని వెంటనే తాండూర్ ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం వికారాబాద్‌లోని ఈశా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మృతురాలికి ఒక కుమారుడు ఉన్నాడు. ఘటనపై మృతురాలి తండ్రి అంగోత్ నారాయణ ఫిర్యాదు మేరకు పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం. ప్రశాంత్ వర్ధన్ తెలిపారు.



నందిని (ఫైల్ ఫోటో)